
కడప శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో శైలపుత్రి అలంకారంలో అమ్మవారు


కడప అమ్మవారిశాలలో దీక్షాబంధన అలంకారంలో కన్యకాపరమేశ్వరిదేవి


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో రాజరాజేశ్వరిదేవిగా...

దేవి శరన్నవరాత్రులు ప్రారంభం

దసరా పండగను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా తొలి రోజైన గురువారం దేవి శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలను విద్యుత్తు దీపాలు, పూలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. జిల్లా కేంద్రమైన కడప నగరంలోని శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలోని అమ్మవారు శైలపుత్రిగా, అమ్మవారిశాలలోని అమ్మవారు దీక్షాబంధన అలంకారంలో, ప్రొద్దుటూరులోని అమ్మ వారిశాలలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.

- న్యూస్‌టుడే, మారుతీనగర్, ప్రొద్దుటూరు పట్టణం

సమస్యల కూత... వినిపించడం మీ బాధ్యత!

నేడు ఎంపీలతో రైల్వే జోనల్ మేనేజర్ సమావేశం

కీలకమైన రైల్వేలైన్లను ప్రస్తావించాల్సిన తరుణమిదే

కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి. చాలా ఏళ్లుగా పనులు నిలిచిపోయాయి. రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ ప్రజలకు ఉపయుక్తమైన ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.

- కొత్త పల్లవి ఎత్తుకుంటూ ఇటీవల కేంద్ర రైల్వేశాఖ మంత్రికి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి విజ్ఞప్తి

కడప పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో రైల్వే పరంగా పలు సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధి పనులు పూర్తిచేయాలి. ముఖ్యంగా వైఎస్‌ఆర్ జిల్లా ముద్దనూరు నుంచి అనంతపురం జిల్లా ముదిగుబ్బ వరకు రైల్వేలైను నిర్మాణం ద్వారా బెంగళూరు మార్గంలోకి కలిపేవిధంగా రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలి.

- ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసిన కడప ఎంపీ అవినాష్‌రెడ్డి

కడప- బెంగళూరు రైల్వేలైన్‌పై ఏకాభిప్రాయం లేకుండా వైకాపాకు చెందిన ఇద్దరు ఎంపీలు వేర్వేరుగా ప్రతిపాదనలు అందించారు.


ముళ్లకంపలతో పెండ్లిమర్రి వద్ద రైల్వేలైను

- ఈనాడు, కడప

అన్నమయ్య, వైఎస్‌ఆర్ జిల్లాల్లో కీలకమైన రైల్వే ప్రాజెక్టులు గత వైకాపా ప్రభుత్వ హయాంలో పడకేశాయి. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్మాణంలో ఉన్న, సర్వే చేపట్టిన ప్రాజెక్టులేవీ ముందుకు సాగలేదు. ప్రధానంగా కడప- బెంగళూరు రైల్వే ప్రాజెక్టును ముందుకుసాగలేదు. గత సర్కారులో పార్లమెంటు వేదికగా రైల్వే ప్రాజెక్టులపై వైకాపా ఎంపీలు అడిగిన ప్రశ్నకు ఆశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానమిస్తూ మీరే మీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. ఒప్పందం మేరకు వాటా నిధులివ్వడానికి ముందుకొస్తేనే ప్రాజెక్టు పూర్తవుతుందని తేల్చి చెప్పారు. వైకాపా ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన రైలు మార్గానికి కేంద్రం ఆమోదం తెలపలేదు. ఇలాంటి పరిస్థితుల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను గట్టెక్కించడానికి, సర్వే చేపట్టిన పనులను పూర్తిచేయడానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.

● ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలను కలిపే కడప- బెంగళూరు రైల్వేప్రాజెక్టు పట్టాలెక్కించాల్సి ఉంది. ఎంపీలు బాధ్యత తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది. విజయవాడలో శుక్రవారం ఎంపీలతో రైల్వే జీఎం సమావేశం కీలకం కానుంది. కడప- బెంగళూరు కొత్తరైలు మార్గం ఏర్పాటుకు 2008-09లో కేంద్రం ఆమోదం తెలిపింది. 2010, సెప్టెంబరు 1న శంకుస్థాపన జరిగింది. ఎనిమిదేళ్లలో పూర్తిచేస్తామని అప్పటి పాలకులు ప్రకటించారు. ఇప్పటివరకు కేవలం రూ.317 కోట్లతో పెండ్లిమర్రి వరకు 21.8 కిలోమీటర్ల రైల్వేలైను నిర్మాణం మాత్రమే పూర్తయింది. రాష్ట్రంలోనే 83.5 శాతం పనులు చేయాల్సి ఉంది. రైల్వేలైను మొత్తం పొడవు 268 కిలోమీటర్లు కాగా, ఇందులో 217.60 కిలోమీటర్లు రాష్ట్రంలోని గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోకి రాగా, మిగిలిన 50.4 కిలోమీటర్లు బెంగళూరు రైల్వే డివిజన్ పరిధిలోకి వెళ్తుంది. ప్రాజెక్టును నాలుగు దశల్లో పూర్తిచేయడానికి ప్రణాళిక తయారు చేశారు. మొదటి దశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు, రెండో దశలో పెండ్లిమర్రి నుంచి రాయచోటి మీదుగా వాల్మీకిపురం వరకు, మూడో దశలో వాల్మీకిపురం నుంచి కర్ణాటక రాష్ట్రం మదగట్ట, చివరి దశలో ముళబాగల్ మీదుగా కోలార్- బంగారుపేట రైల్వే లైనులో కలుస్తుంది.

తగ్గనున్న 226 కిలోమీటర్లు

విద్య, ఉపాధి, వ్యాపార, ఇతర పనుల నిమిత్తం చాలామంది బెంగళూరుకు వెళ్తుంటారు. రెండు జిల్లాల వాసులు రైలుమార్గంలో బెంగళూరుకు వెళ్లాలంటే రేణిగుంట మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. కడప-బెంగళూరు రైల్వేప్రాజెక్టు పూర్తయితే దాదాపు 226 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఉత్తర భారతదేశం నుంచి బెంగళూరుకు త్వరగా వెళ్లడానికి వీలవుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా భారం కూడా తగ్గుతుంది.

ఒప్పందం చేసుకుని... చేతులెత్తేసి

ప్రాజెక్టు వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం నిధులు చెల్లించేవిధంగా ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడ్డాక వాటా నిధులు చెల్లించలేమనే అభిప్రాయానికొచ్చింది. భూసేకరణకు మాత్రమే వాటా చెల్లించేందుకు అనుమతించాలని విన్నవించింది. ఇందుకు కేంద్రం అంగీకరించలేదు. రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులిస్తేనే పనులు వేగవంతమవుతాయని కేంద్రం చెబుతోంది. కేంద్రం వార్షిక బడ్జెట్లలో నామమాత్రంగా నిధులు విదుల్చుతోంది. రైల్వే లైను నిర్మాణం ఆలస్యం జరుగుతున్న కొద్దీ వ్యయం కూడా పెరుగుతోంది. శంకుస్థాపన సమయంలో రూ.2 వేల కోట్లతో పూర్తిచేసేందుకు అంచనాలు రూపొందించగా, ప్రస్తుతం నిర్మాణ వ్యయం రూ.3,037 కోట్లకు పెరిగింది.

వైకాపా ప్రతిపాదనకు కలగని మోక్షం

2008లో రైల్వేశాఖ ఆమోదం మేరకు కడప నుంచి పెండ్లిమర్రి, ఇడుపులపాయ, అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె, రాయచోటి, వాల్మీకిపురం, మదనపల్లె, కర్ణాటక రాష్ట్రం మదగట్ట, ముళబాగల్ మీదుగా కోలార్-బంగారుపేట రైల్వేలైనులో కలుస్తుంది. ఒప్పందం ప్రకారమైతే రాష్ట్ర ప్రభుత్వం రూ.1,500 కోట్లు వెచ్చించాల్సి వచ్చింది. రాష్ట్ర వాటా భారాన్ని మోయలేక కొత్త ప్రతిపాదనను రైల్వేబోర్డు ముందుంచింది. కడప నుంచి కోలార్-బంగారుపేట లైనుతో కలిపే ప్రాజెక్టును పక్కన పెట్టే ప్రయత్నం చేసింది. వైఎస్‌ఆర్ జిల్లా ముద్దనూరు నుంచి అనంతపురం జిల్లా ముదిగుబ్బ వరకు రైల్వేలైను నిర్మాణం ద్వారా బెంగళూరు మార్గంలోకి కలిపేదు కొత్త ప్రతిపాదించింది. మొత్తం 72 కిలోమీటర్ల లైనుతో సరిపెట్టవచ్చునని భావించిన కేంద్రం ఆమోదం తెలపలేదు.

మరికొన్ని ప్రాజెక్టులు

గిద్దలూరు-భాకరాపేట, ఓబులవారిపల్లె- రాయచోటి, కదిరి మీదుగా కడప- హిందూపురం రైల్వేలైన్లకు మోక్షం కలగాల్సి ఉంది. ఎర్రగుంట్ల-నంద్యాల సికింద్రాబాద్ మార్గంలో వందే భారత్ రైలు ప్రవేశపెట్టడం, ఎర్రగుంట్ల రైల్వేజంక్షన్‌ను అమృత్ స్టేషన్‌గా గుర్తించడం, కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌ను ముద్దనూరు, కొండాపురం రైల్వేస్టేషన్లో నిలపడం, కడప రైలునిలయంలో లిఫ్ట్, ఎస్కలేటర్ ఏర్పాటు చేయడం, నందలూరు రైలునిలయాన్ని అభివృద్ధి చేయడం.

పిడుగుపాటుకు ముగ్గురు దుర్మరణం

పెండ్లిమర్రి మండలంలో విషాదం


మారుతీప్రసాద్‌రెడ్డి (పాత చిత్రం)


మృతురాలు శివపార్వతి


మృతిచెందిన తేజేశ్వర్‌రెడ్డి

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: పిడుగుపాటుకు గురై ముగ్గురు మృతి చెందిన ఘటన పెండ్లిమర్రి మండలంలో గురువారం చోటుచేసుకుంది. తుమ్మలూరు గ్రామానికి చెందిన ఎన్.శివపార్వతి (30), ఆమె బావ కుమారుడు తేజేశ్వర్‌రెడ్డి (10) గేదెలను మేపడానికి సమీప పొలాల్లోకి వెళ్లారు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ఓ చెట్టు కింద నిల్చున్నారు. ఒక్కసారిగా పిడుగుపాటుకు వారిద్దరూ మృత్యువాత పడ్డారు. దీంతోపాటు చెట్టు కొమ్మలతోపాటు పక్కనున్న విద్యుత్తు స్తంభం సైతం విరిగిపోయింది. వ్యవసాయ పనులతోపాటు గేదెల పెంపకంతో జీవిస్తున్న శివపార్వతికి భర్త నాగేశ్వర్ రెడ్డి, ఇద్దరు పిల్లలున్నారు. ఎన్.బాబురెడ్డి, లక్ష్మీదేవిల దంపతుల కుమారుడు ఎన్.తేజేశ్వర్‌రెడ్డి నాలుగోతరగతి చదువుతున్నాడు. ఒక్కాగానొక్క కుమారుడి మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. ఇదే గ్రామంలో మరోచోట పిడుగుపాటుకు పొలంలో పనిచేయడానికి వెళ్లిన పగడాలపల్లెకు చెందిన జి.మారుతీప్రసాద్‌రెడ్డి (30) మృతిచెందారు. ప్రమాదంలో మరోవ్యక్తి స్పృహ కోల్పోగా, ఆయనను వెంటనే కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. మారుతీప్రసాద్‌రెడ్డికి భార్య, మూడేళ్ల కుమారుడు, తల్లి ఉన్నారు. వ్యవసాయ పనులకు వెళ్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈయన మృతితో మాకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. వీరు ముగ్గురి మృతితో తుమ్మలూరు, పగడాలపల్లె గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసులు, రెవెన్యూశాఖల సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విజ్ఞాన యాత్ర

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 500 మంది విద్యార్థులకు కడప నుంచి అరకువరకు విజ్ఞాన, విహారయాత్ర ఏర్పాటు చేశామని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కడప కలెక్టరేట్‌లో డీఈవో అనురాధతోకలిసి ఆయన మాట్లాడుతూ ఏపీ దర్శన్ పేరుతో ఈ నెల 4 నుంచి ఎనిమిది రోజుల పాటు శ్రీకాళహస్తి, శ్రీహరికోట, పులికాట్‌సరస్సు, అమరావతి, కొండవీడు, విజయవాడ అంబేడ్కర్ విగ్రహం, పోలవరం, కాకినాడ, యానాం, ద్వారకా తిరుమల, విశాఖపట్టణం, అరకు ప్రాంతాల్లో యాత్ర కొనసాగుతుందన్నారు. ఇందుకు సంబంధించి 11 బస్సులను ఏర్పాటు చేశామని, విద్యార్థులతో పాటు మరో 52 మంది అదనపు సిబ్బంది ఇందులో ఉంటారన్నారు.

కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌ఛైర్మన్‌గా జేసీ

బిల్టప్, న్యూస్‌టుడే: కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌ఛైర్మన్‌గా జేసీ అదితి సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు వీసీగా పనిచేస్తున్న నందన్‌ను కొద్దిరోజుల కిందట ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో అదితిసింగ్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు.

జిల్లా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, పక్కన ఎమ్మెల్యే మాధవిరెడ్డి, సీపీవో వెంకట్రావు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి, లక్ష్యాలకు సంబంధించి సలహాలు, సూచనలివ్వాలని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. జిల్లా విజన్ ప్లాన్ రూపకల్పనపై కలెక్టరేట్‌లో గురువారం కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, సీపీవో వెంకట్రావులతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మండల స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపే విధంగా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సేవల రంగాల్లో అనుభవం ఉన్నవారితో పాటు యువత, విద్యార్థులు, ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం బీసీ సంఘం నేత అవ్వారు మల్లికార్జున, జేవీరమణ, రైతు సుబ్బరాయుడు, శివారెడ్డి, పెంచలయ్య, శివశంకర్, శేషారెడ్డి, డాక్టర్ శివానాయక్ తదితరులు సూచనలు చేశారు. సమావేశంలో కడప ఆర్డీవో వెంకటపతి, డీపీవో ప్రభాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు నాగేశ్వరరావు, సురేష్‌కుమార్, నాగరాజు, ఆనంద్‌నాయక్, సరస్వతి, సురేష్‌రెడ్డి, అనురాధ, విజయ్‌కుమార్, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే ఆర్టీసీ లక్ష్యం : మంత్రి మండిపల్లి


ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో గురువారం ఆయన నూతనంగా వచ్చిన తొమ్మిది కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలన్నారు. రాష్ట్రంలో 110 రోజుల పాలనలో సరాసరి రోజుకు రెండు చొప్పున కొత్త బస్సులు ప్రారంభించామన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కొత్త బస్సులు కొనుగోలు చేసి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యమైందని, ఆర్టీసీని పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. రాయచోటి-విజయవాడ, మదనపల్లె-విజయవాడకు సూపర్ లగ్జరీ, రాయ చోటి-తిరుమలకు రెండు సప్తగిరి బస్సులు, తిరుపతికి మూడు లగ్జరీ బస్సులు, వేంపల్లెకు ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు అందుబాటులోకి వచ్చాయని మంత్రి వివరించారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం రాము, అధికారులు, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చరవాణుల స్వాధీనంలో మొదటి స్థానం

రూ.1.08 కోట్ల విలువైన 555 ఫోన్లు పట్టివేత


యజమానికి చరవాణి అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: వివిధ రకాల కారణాలతో పోగొట్టుకున్న చరవాణులను సైబర్‌క్రైం ఠాణా పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి స్వాధీనం చేసుకున్నారు. రూ.1.08 కోట్లు విలువ చేసే 555 చరవాణులను జప్తు చేసి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చేతుల మీదుగా యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చరవాణుల స్వాధీనంలో రాష్ట్రంలో జిల్లా పోలీసుశాఖ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో అయిదు విడతల్లో రూ.7.4 కోట్ల విలువైన 4,068 చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. సైబర్ ఠాణా సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి, సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రకాష్ బాబు, కడప బాధ్య డీఎస్పీ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన టెట్

కడప విద్య : జిల్లావ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాల్లో గురువారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రారంభమైంది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్ష నిర్వహించారు. మొదటిరోజు 1,490 మందికి 1,342 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో అనురాధ తెలిపారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

వైవీయూ (కడప) : యోగి వేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాలలో ఎంబీఏ ఎంసీఏ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. ఏపీ ఐసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని సూచించారు. ఆసక్తి గలవారు ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ధ్రువపత్రాలు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, నిర్ణీత ఫీజు తెచ్చుకోవాలన్నారు.

ఎనిమిదేళ్ల బాలికపై మారుతండ్రి అత్యాచారం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: తండ్రి స్థానంలో ఉండాల్సిన వ్యక్తే బాలికపై అత్యాచారం చేసిన అమానవీయ ఘటన కడపలో చోటుచేసుకుంది. చిన్నచౌకు ఠాణా పరిధిలోని ఓ మహిళకు ముగ్గురు పిల్లలున్నారు. ఆమె భర్త చనిపోవడంతో మళ్లీ ఓ యువకుడిని(27) పెళ్లి చేసుకుంది. వీరికి పది రోజుల కిందట పాప పుట్టింది. ఈ నేపథ్యంలో గురువారం తల్లి ఇంట్లో ఎనిమిదేళ్ల కుమార్తెను ఉంచి ఆసుపత్రికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో కుమార్తె వరుసైన బాలికపై మారుతండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సమయానికి భార్య రావడంతో అతను బయటకు వెళ్లిపోయాడు. ఆమె వెంటనే చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

విద్యుత్తు తీగలతో నిప్పంటుకున్న లారీ


నిప్పంటుకొని దగ్ధమవుతున్న టిప్పర్ టైర్లు

దువ్వూరు, న్యూస్‌టుడే : దువ్వూరులో ఇంది రమ్మ కాలనీ సమీపంలో గురువారం విద్యుత్తు తీగలు ప్రమాదవశాత్తు టిప్పరుకు తగలడంతో నిప్పంటుకొని టైర్లు దగ్ధమయ్యాయి. ఇసుక లోడుతో వచ్చిన టిప్పరు వాహనం ఇసుకను విడిచి వెళుతుండగా మోటార్లకు విద్యుత్తు సరఫరా అయ్యే తీగలు కిందకి ఉండటంతో లారీ చోదకుడు గమనించలేదు. దీంతో లారీకి పైభాగంలో తీగలు తగిలి మంటలు వ్యాపించాయి. దీంతో చోదకుడు వెంటనే లారీని ఆపి కిందకి దూకడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు విద్యుత్తు శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్తు సరఫరాను నిలిపి వేసి నీటిని చల్లి మంటలను అదుపు చేశారు.

వాయుబండ పేలి భార్యాభర్తలకు గాయాలు

ఖాజీపేట, న్యూస్‌టుడే: వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలి భార్యాభర్తలు గాయపడిన సంఘటన గురువారం మండల పరిధిలోని బోసిరెడ్డిపల్లెలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జయరాంరాజు, రాజేశ్వరి దంపతులు వ్యవసాయ కూలిపనికి వెళ్లి వచ్చి ఇంట్లో వంట చేసుకునే క్రమంలో స్టవ్ వెలిగిస్తుండగా.. ప్రమాదవశాత్తూ సిలిండర్ పేలి ఇరువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కను తప్పించబోయి బోల్తా పడిన కారు... యువకుడి మృతి

వింజమూరు, న్యూస్‌టుడే : హఠాత్తుగా అడ్డు వచ్చిన కుక్కను తప్పించబోయి కారు బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కావలి- ఉదయగిరి రోడ్డులో మండలంలోని బొమ్మరాజుచెరువు సమీపంలో గురువారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. కడపలోని ఎన్‌జీవో కాలనీకి చెందిన ఇల్లూరు శ్రీకాంత్‌రెడ్డి, పెండ్లిమర్రికి చెందిన కె.రామసుబ్బారెడ్డి (35) కావలికి కారులో వచ్చారు. పట్టణంలో పని ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. మండలంలోని బొమ్మరాజు చెరువు సమీపంలో రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయారు. ఈక్రమంలో పక్కన ఉన్న కంకర గుట్ట ఎక్కిన కారును అదుపు చేయలేకపోవడంతో బోల్తా పడింది. విద్యుత్తు స్తంభాన్ని కూడా ఢీకొంది. డోర్ ఊడిపోయి ముందు సీటులో ఉన్న రామసుబ్బారెడ్డి కింద పడగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సీటు బెల్ట్ పెట్టుకుని డ్రైవింగ్ చేస్తున్న ఇల్లూరు శ్రీకాంత్‌రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడు రామసుబ్బారెడ్డికి భార్య రాజేశ్వరి, కుమారుడు జీవాన్స్, కుమార్తె లతిక ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధార్మిక పరిషత్ నిర్ణయం మేరకే త్వరలో మఠాధిపతి నియామకం

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠాధిపతి ఎవరనే విషయం ధార్మిక పరిషత్ త్వరలో నిర్ణయం తీసుకుంటుందని మొదటి భార్య పెద్దకుమారుడు వేంకటాద్రిస్వామి తెలిపారు. ఈ మఠాధిపతి ఎవరనే విషయం గత మూడేళ్లుగా న్యాయస్థానం విచారణలో ఉండడం తెలిసిందే. అప్పటి నుంచి మఠాన్ని ప్రభుత్వం ప్రత్యేకాధికారిని నియమించి పర్యవేక్షిస్తోంది. దివంగత మఠాధిపతి రెండో భార్య మారుతీమహాలక్షుమ్మ తన కుమారుడికి వీలునామా రాశారని, తమకే మఠాధిపత్యం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ బాధ్యతలు తనకే దక్కాలని దివంగత మఠాధిపతి మొదటి భార్య పెద్దకుమారుడు వేంకటాద్రిస్వామి, రెండో కుమారుడు వీరభద్రస్వామి వేర్వేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్లన్నింటినీ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం కొట్టివేసిందని వెంకటాద్రిస్వామి గురువారం మీడియాకు వెల్లడించారు.

జే బ్రాండ్లకు ఇక చెల్లు చీటీ

12 నుంచి కొత్త విధానం అమలు

కడపకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి గడిచిన రెండేళ్ల నుంచి మద్యం తాగడంతో తీవ్ర అనారోగ్యం పాలై మంచానికే పరిమితమయ్యాడు. వైద్యులు పరీక్షించి నాసిరకం మద్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆయన కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది.

కడప నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి గడిచిన మూడేళ్లలో ప్రతి రోజు జే బ్రాండు మద్యం తాగి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. కాలేయం దెబ్బతిని మృతి చెందాడు. అతని కుటుంబం అనాథగా మారింది


12 నుంచి విముక్తి

న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

గడచిన ఐదేళ్ల వైకాపా పాలనలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి అంతకుముందు లేని కొత్త బ్రాండ్లను సరఫరా చేసింది. ఇవన్నీ నాసిరకం ఉండడంతో వాటిని తాగిన పలువురు అనారోగ్యం పాలయ్యారు. ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయి. చాలామంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఎక్కువగా 30 నుంచి 45 ఏళ్ల వయస్సు లోపు వారు ఉన్నారు. గతమెన్నడూ లేని విధంగా ఇలాంటి రోగులు వస్తున్నారని వైద్యులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం మద్యం వల్లే వీరంతా వ్యాధుల పాలయ్యారని వారు ధ్రువీకరించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైకాపా మద్యంపై కన్నెర్ర చేసింది. కొత్త మద్యం పాలసీకి శ్రీకారం చుట్టింది. ఈ నెల 12 నుంచి కొత్త విధానం అమలు చేయనుంది. జే బ్రాండ్లకు అడ్డుకట్ట వేసి, నాణ్యమైన మద్యాన్ని రూ. 99కే అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

సెబ్ విలీనంతో నిఘా పటిష్టం

వైకాపా పాలన అధికారంలోకి రాగానే ఎక్సైజ్ శాఖను విభజించి సెబ్ ఏర్పాటు చేశారు. దాదాపు 75 శాతం సిబ్బంది సెబ్‌కు కేటాయించారు. దీంతో గడిచిన ఐదు ఏళ్ల కాలంలో ఎక్సైజ్‌శాఖ నిర్వీర్యమైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేసింది. సిబ్బంది మొత్తం తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. ఇక నుంచి మద్యం అక్రమ రవాణా, కల్తీ సరుకు విక్రయాలపై నిఘా పటిష్టం చేయనున్నారు.

అందుబాటులో నాణ్యమైన మద్యం



ఈ నెల 12 నుంచి కొత్త మద్యం విధానం అమలు కానుంది. జిల్లా వ్యాప్తంగా 139 ప్రైవేటు మద్యం దుకాణాలు రానున్నాయి. ఇప్పటికే డిపోలకు నాణ్యమైన సరకు దిగుమతి అయింది. ఇక నాసిరకం మద్యం అనే మాట వినిపించదు.

- జయరాజు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, కడప

మద్యం దుకాణాలకు పోటాపోటీ

దరఖాస్తు రుసుం రూపంలో భారీగా ఆదాయం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో కొత్తగా మద్యం దుకాణాల ఏర్పాటుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. పైగా కడప నగరంలో ఫలానా చోటే దుకాణం పెట్టుకోవాలనే నిబంధన లేదు. డ్రాలో దక్కితే అతను నగరంలో ఎక్కడైనా ప్రారంభించే అవకాశం కల్పించడంతో టెండర్లు వేసేందుకు వ్యాపారులు ఉత్సాహం చూపుతున్నారు. అటు తెదేపా, వైకాపా నాయకులు పోటీలు పడుతున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ. 2లక్షలు రుసుం చెల్లించాలి. వీటిని వెనక్కు ఇవ్వరు. అయినా డ్రాలో తగిలితే అంతకు మించి సంపాదించ్చొని ఒక్కొక్కరు 10 నుంచి 15 దుకాణాలకు దరఖాస్తులు వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 139 మద్యం దుకాణాలకు రుసుం రూపంలో రూ. 2.78కోట్ల ఆదాయం వస్తుంది. దరఖాస్తుల సంఖ్య పెరిగితే ఆదాయం మరింత పెరగనుంది.

చివరి మూడు రోజుల్లో... జిల్లా వ్యాప్తంగా గురువారం సాయంత్రానికి 17 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 9 వరకు గడువు ఉంది. చివరి మూడు రోజులు దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. అందులోనూ చివరి రోజు 9వ తేదీ మరీ ఎక్కువగా ఉంటుంది. ఏ దుకాణానికి ఎంత మంది పోటీ పడుతున్నారో తెలుసుకుని, మరింతమంది ముందుకు వచ్చే అవకాశముంది. ప్రస్తుతం బార్లు ఉన్న వారందరూ దరఖాస్తు వేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో పోటీ మరింత పెరిగి ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరనుంది.


హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

హోంగార్డులకు అండగా ఉంటాం: ఎస్పీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలోని హోంగార్డులకు పోలీసుశాఖ అండగా ఉంటుందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. జులై 6న రామాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పి.ఆంజనేయులు అనే హోంగార్డు మృతి చెందాడు. ఈ మేరకు అతని కుటుంబానికి మంజూరైన రూ.30 లక్షల ప్రమాద బీమా చెక్కును గురువారం ఎస్పీ తన కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పని చేస్తున్న హోంగార్డు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆర్ఎస్సై వెంకటేశ్వర్లు, బ్యాంకు అధికారులున్నారు.

ఎంఎస్ఎంఈ తరలింపుపై నిరసనగా 15న పాదయాత్ర


మాట్లాడుతున్న రాకపా రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, పక్కన నాయకులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాన్ని కొప్పర్తి పారిశ్రామిక కేంద్రం నుంచి తరలిస్తూ తెచ్చిన జీవో నెంబర్ 56ను వెంటనే రద్దు చేయాలని, లేదంటే ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలతో కలిసి పోరాటాలు ఉద్ధృతం చేస్తామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రాకపా కార్యాలయంలో గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ రంగాల్లో శిక్షణ, నైపుణ్యం, మార్కెటింగ్ అభివృద్ధి కోసం కేంద్రం పారిశ్రామిక కేంద్రంలో ఏర్పాటు చేసిన సూక్ష్మ చిన్న, మధ్యతరహా సంస్థల సాంకేతిక కేంద్రాన్ని సీఆర్‌డీఏకు తరలిస్తూ తెచ్చిన జీవో 56ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించే అర్హత వైకాపాకు లేదని చెప్పారు. జగన్‌పై కక్ష సాధింపుతోనే చంద్రబాబు సీఆర్‌డీఏకు తరలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తెస్తామని, రాకపా ఆధ్వర్యంలో ఈ నెల 15న కొప్పర్తి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామని వెల్లడించారు. విద్యార్థులు, ప్రజా సంఘాలు, ఆ ప్రాంత ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కడప నగరపాలక, న్యూస్‌టుడే: కడప నగరశివార్లలోని కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు చేయాల్సిన ఎంఎస్ఎంఈ కేంద్రాన్ని తరలించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని వివిధ పార్టీల నాయకులు డిమాండు చేశారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కడప రహదారులు భవనాల శాఖ అతిథి గృహంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కరవు జిల్లాకు కేటాయించిన పరిశ్రమను తరలించాలని జీఓ జారీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు కడప, రాయలసీమ జిల్లాలకు మళ్లీ అన్యాయం చేశారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజాఉద్యమం తప్పదని హెచ్చరించారు. మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగరమేయర్ సురేష్‌బాబు, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. గురువారం రాత్రి ఐకాస నేతలు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం జిల్లాకార్యదర్శి చంద్రశేఖర్, నారాయణరెడ్డి, సత్తార్, గుర్రప్ప, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి తదితరులున్నారు.

ఈవోపీఆర్డీలకు బదిలీ ఉత్తర్వులు

కడప ఏడురోడ్లు : జిల్లాలో 13 మంది మండల పంచాయతీరాజ్ విస్తరణాధికారుల (ఈవోపీఆర్డీ) బదిలీలు జరిగాయి. వారి బదిలీలు ఈనెల 22నే ముగిసినప్పటికీ స్వచ్ఛతాహీ సేవ, స్వర్ణాంధ్రప్రదేశ్-2047 కార్యక్రమాల్లో ఉండడంతో వారికి ఉత్తర్వులు గురువారం అందాయి. వెంటనే ఆయా ప్రాంతాల్లో రిపోర్టు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు.

సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం

మారుతీనగర్, న్యూస్‌టుడే: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే సహించేది లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. స్థానిక జిల్లా కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 3 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినా, ప్రత్యేక తరగతుల పేరుతో విద్యాసంస్థలు నడుపుతున్నారని, జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తరగతులు నిర్వహిస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని, హెచ్చరించారు.

పీఆర్సీ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండు

కడప విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త పీఆర్సీని ఏర్పాటు చేయాలని, అది అమల్లోకి వచ్చే వరకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో గురువారం చెన్నూరు, ఖాజీపేట, కమలాపురం, వల్లూరు మండలాల మహాసభ జరిగింది. విజయకుమార్ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హయాంలో పీఆర్సీ విషయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 12వ పీఆర్సీ అమలులో సైతం కమిషనర్‌ను నియమించి కాలయాపన చేశారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై దృష్టిసారించాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు 11వ పీఆర్సీ, కరవుభత్యం, ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐ, సరెండర్‌లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. జీవో 117ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెంమహేష్‌బాబు, సుజాతరాణి, నరసింహారావు, ఏజాస్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో స్వల్ప వర్షపాతం నమోదు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. అందులోభాగంగా వేములలో అత్యధికంగా 50.2 మిల్లీమీటర్లు, తొండూరులో 35.6, పులివెందులలో 26.0, కలసపాడులో 25.4, ఒంటిమిట్టలో 16.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.


మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, పక్కన జయరాం, గుర్రప్ప

'లిక్కర్ కుంభకోణంలో జగన్‌కు జైలు తప్పదు'

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇప్పటి వరకు లిక్కర్ కుంభకోణమే పెద్ద ఆర్థిక దోపిడీ అని, అందులో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కడపలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ వైకాపా పాలనలో లిక్కర్, మైనింగ్ దోపిడీ యథేచ్ఛగా సాగిందని, ఇందులో మాజీ సీఎం, ఆయన సతీమణి దోషులుగా తేలనున్నారు. గనుల శాఖ వెంకటరెడ్డిని అదుపులోకి తీసుకున్నారని, సిరిసిల్ల రైల్వేలో పనిచేసిన పెద్ద అధికారి అప్రూవర్‌గా మారుతారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అనేక ఆర్థిక దోపిడీలకు పాల్పడి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు జయరాం, మాజీ జీపీ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పిచికారీ యంత్రం ప్రారంభం


పిచికారీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులో సరికొత్త స్ప్రేయింగ్ పరికరాన్ని గురువారం శక్తిమాన్ కంపెనీ సీనియర్ సేల్స్ మేనేజర్ సుబ్బారెడ్డి ప్రారంభించారు. దీనిని ప్రకాశ్ ఆగ్రో పరిశ్రమ, శక్తిమాన్ కంపెనీ సంయుక్తంగా అందుబాటులోకి తెచ్చారు. పంటలకు సోకిన తెగుళ్ల నివారణకు వాడే పిచికారీ యంత్రాన్ని కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించామని, సులభ పద్ధతిలో మందులను స్ప్రేయింగ్ చేయవచ్చునని ప్రకాశ్ ఆగ్రో పరిశ్రమ ప్రతినిధులు విజయభాస్కర్‌రెడ్డి, గురు భాస్కర్‌రెడ్డి చెప్పారు.


ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష, కార్మిక సంఘాలు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై నిరసన

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: ఎంతో మంది త్యాగధనుల పోరాట ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని కోరుతూ కడప ఆర్డీవో కార్యాలయం ఎదుట వామపక్ష నేతలు నిరసన చేపట్టారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారెడ్డి, దస్తగిరిరెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేషన్, చంద్రారెడ్డి, సుబ్బయ్య, మద్దిలేటి,బాదుల్లా, శివారెడ్డి, గోపాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు


వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన జేసీ అదితిసింగ్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో కొత్తగా పలు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపినట్లు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 1914 పోలింగ్ కేంద్రాలున్నాయని, వీటికి అదనంగా మరో 22 కేంద్రాలకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అందులో కడపలో 19, ప్రొద్దుటూరులో ఒకటి, కమలాపురంలో రెండు అవసరమని గుర్తించామన్నారు. మైదుకూరు, కమలాపురం నియోజకవర్గాల్లో నాలుగు పోలింగ్‌కేంద్రాల మార్పునకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. ఓటర్ల సర్వే ప్రక్రియ జిల్లాలో 99 శాతం పూర్తయిందన్నారు. ఈ నెల 29వ తేదీ నాటికి ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా సిద్ధం చేస్తామని వివరించారు. ఆయా పార్టీల నాయకులు హరిప్రసాద్, పాకా సురేష్, నరసింహం, గుర్రప్ప, లక్ష్మణ, సుధాకర్, శ్రీనివాసులు, మనోహర్, అన్వేషన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయం అభివృద్ధికి లేకుండా కృషి చేస్తానని నూతన రిజిస్ట్రార్ ఆచార్య టి. రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ వర్సిటీ ప్రారంభం నుంచి ఇక్కడే పనిచేస్తున్న దృష్ట్యా అన్ని విభాగాలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. వీసీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, వివిధ విభాగాల డీన్‌లు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లు, సభ్యులు, శాఖాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిపై నేటి నుంచి శిక్షణ తరగతులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: జడ్పీలోని డీపీఆర్‌సీ భవన్‌లో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు, 8 నుంచి 10వ తేదీ వరకు పంచాయతీల అభివృద్ధిపై జిల్లాస్థాయి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, డీఎల్‌పీవోలు తప్పక హాజరు కావాలని సూచించారు.

పులివెందులలో ఫ్యాక్షన్‌కు పునాది వేసింది వైఎస్ కుటుంబమే!

- జిలెటిన్‌స్టిక్స్‌తో మిద్దెలు కూల్చిన ఘనత వారిదే
- మట్కా డబ్బులతోనే బ్యానర్లు కట్టించారు
- అక్రమ మైనింగ్‌పై ఎంపీ వ్యాఖ్యలను ఖండించిన మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలో ఫ్యాక్షన్‌కు పునాది వేసింది వైఎస్ కుటుంబమేనని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆరోపించారు. అక్రమ మైనింగ్‌పై ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ మైనింగ్ వ్యాపారం చేసింది వైఎస్ కుటుంబమేనని, ,గత 40 ఏళ్లుగా మీ కనుసన్నల్లోనే అక్రమ వ్యాపారం జరిగిందని విమర్శించారు. వేముల మండలం కొత్తపల్లె గ్రామంలో జరిగిన ఒక వివాహేతర సంబంధ హత్యను కూడా ఎన్డీయే ప్రభుత్వంపై వేయడం మంచి పద్ధతి కాదన్నారు. గత ప్రభుత్వంలో నాగమ్మ అనే మహిళ, అంబకపల్లెకు చెందిన బీసీ నాయకుడు నాగరాజు, దిద్దేకుంటకు చెందిన తెదేపా నాయకుడు పరమేశ్వరరెడ్డిని హత్యలు చేసింది మీ (వైకాపా) ప్రభుత్వమే కదా అని దుయ్యబట్టారు. గతంలో తెదేపా నాయకుడు పార్నపల్లె ధనుంజయనాయుడు తండ్రి సూర్యనారాయణ ఇంటిని డైనమైట్లతో ఛిద్రం చేసిన ఘనత మీ కుటుంబానిదేనన్నారు. గత వైకాపా ప్రభుత్వంలోనే పులివెందులలో విచ్చలవిడిగా మట్కా,జూదం జరిగిందని, మట్కా డబ్బులతోనే ఐదేళ్లపాటు బ్యానర్లు కట్టించారని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పులివెందులలో మట్కాకు పూర్తిగా అడ్డుకట్ట వేశామన్నారు. పులివెందుల పురపాలక సంఘంలో సీసీ కెమెరాలు పనిచేయకుండా చేసి ఇష్టానుసారంగా రాత్రివేళల్లో మైనింగ్ సంపదలను కొల్లగొట్టారన్నారు. వీటన్నింటిపై పులివెందుల పూలంగళ్ల కూడలిలో చర్చకు మేం సిద్ధం మీరు సిద్ధమేనా అని ఆయన ప్రశ్నించారు. పులివెందుల పురపాలక సంఘంలో సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట నాయకులు మహబూబ్ బాషా తదితరులున్నారు.

మాజీ రిజిస్ట్రార్‌ను తొలగించాలి

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయంలో లక్షల రూపాయలు వసూలు చేసి అక్రమ నియామకాలు చేపట్టిన గత రిజిస్ట్రార్ ఆచార్య వెంకటసుబ్బయ్యను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. గంగా సురేష్ పేర్కొన్నారు. ఆయన గురువారం వైవీయూలో మాట్లాడుతూ వారి జీతభత్యాలను విశ్వవిద్యాలయ అంతర్గత నిధుల నుంచి రూ.కోట్లను దుర్వినియోగం చేశారని విమర్శించారు.

కన్నెలూరులో కలుషిత నీటిపై మున్సిపల్ ఆర్డీ ఆరా

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక కన్నెలూరులో పైపులైనుకు లీకేజీ కారణంగా తాగునీరు కలుషితమై ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. సరఫరా అయిన కలుషిత నీరు తాగడంతో సుమారు 30 మంది వాంతులు విరేచనాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరిపోయారు. ఈక్రమంలో గురువారం అనంతపురం నుంచి వచ్చిన మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్ కన్నెలూరులో పర్యటించి కారణాలను తెలుసుకుంటున్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కూడా అధికారులకు ఫోన్ చేశారు. రామకృష్ణ కాలనీలో ఓ మహిళ చనిపోయారని వదంతులు వ్యాపించడంతో పంచాయతీ, వైద్యఆరోగ్య శాఖ అధికారులు ఆరా తీశారు. ఆరు నెలలుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ గురువారం చనిపోయినట్లు తేల్చారు. నగర పంచాయతీ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా 98499 01670 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

మెరుగైన విద్యుత్తు సరఫరాకు కృషి: ఎస్ఈ

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించి లాభాల బాట పట్టించేందుకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు మెరుగైన విద్యుత్తును అందించేందుకు కృషి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ పేర్కొన్నారు. కడప డివిజన్ కార్యాలయంలో గురువారం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిర్లక్ష్యం వీడి క్షేత్రస్థాయిలో లైన్ల వెంట తిరిగి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మొండి బకాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్తు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, వాలిన స్తంభాలను సరిచేయాలన్నారు. కడప ఈఈ హరిసేవ్యా నాయక్, డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠకుల హాజరుపై ఆరా


దస్త్రాలు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయాధికారి అమీరుద్దీన్

కొండాపురం, న్యూస్‌టుడే: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయాధికారి అమీరుద్దీన్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పలు దస్త్రాలను పరిశీలించారు. పాఠకులకు 'ఏమేమి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఎంతమంది పాఠకులు వస్తున్నారు' అనే వివరాలు సేకరించారు. గండికోట జలాశయం పరిధిలో కొండాపురం గ్రామం ముంపునకు గురికావడంతో పాఠకులకు ఇబ్బంది కలుగకుండా గ్రంథాలయాన్ని కొత్త గ్రామంలోకి మార్చాలని స్థానిక గ్రంథాలయాధికారి వరలక్ష్మికి సూచించారు.

ప్రొద్దుటూరు
• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం రేపు

చాపాడు: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు తీసుకున్న వారందరికీ సత్కారం చేస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అవార్డీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేవీఎల్వీ.రమణయ్య తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటనలో తెలియజేస్తూ శనివారం ఉదయం 10 గంటలకు ప్రొద్దుటూరు పట్టణం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పథకాల అమలు రాష్ట్రంలో ఉండి చూడాలి

చాపాడు, న్యూస్‌టుడే: వంద రోజుల్లో తెదేపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, అమలవుతున్న తీరును మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఉండి చూడాలని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తాను సీఎంగా ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందనడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

?: ప్రొద్దుటూరు మండలం జమ్మలమడుగురోడ్డు నుంచి దొరసానిపల్లె గ్రామంలోకి వెళ్లే వెంకటపతినగర్‌లో వీధిదీపాలు వెలగకపోవడం వలన అంధకారంగా మారింది. వర్షాకాలం కావడంతో తేలు, పాములులాంటి విషపురుగులు సంచరిస్తూ ప్రమాదకరంగా మారింది. **- చంద్రశేఖర్, స్థానిక ఉపాధ్యాయుడు**

✔: వీధిదీపాలను వెలిగించేందుకు చర్యలు తీసుకుంటాను.
- రామకృష్ణారెడ్డి, దొరసానిపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి

?: ప్రొద్దుటూరు పట్టణం దస్తగిరిపేటలో మురుగుకాలువల్లో పూడిక సక్రమంగా తొలగించడం లేదు. మసీదు వీధి నుంచి జిన్నారోడ్డు వరకు ఉన్న మురుగుకాలువ పూడికతో నిండిపోయింది. చిన్నపాటి వర్షమొస్తే మురుగునీరంతా రోడ్డుపైనే చేరుతుంది. **- అక్రమ్, స్థానికుడు**

✔: దస్తగిరిపేటలో పూడికతీతకు చర్యలు తీసుకుంటాను.
- మీసా సునీత, పారిశుద్ధ్య అధికారి, రెండో డివిజన్, ప్రొద్దుటూరు పురపాలక సంఘం

?: ప్రొద్దుటూరు పట్టణం మైదుకూరురోడ్డులో శివాలయం కూడలి వద్ద లాడ్జి వద్ద ఉన్న మురుగుకాలువ పూడికతో నిండిపోయింది. వర్షమొస్తే మురుగునీరంతా రోడ్డుపైకి పారుతోంది. దుర్వాసన వస్తోంది. **- పవన్, స్థానికుడు**

✔: శివాలయం కూడలి వద్ద మురుగు కాలువ పూడిక తొలగిస్తాం.
- రాజేంద్రప్రసాద్, 24వ సచివాలయ వార్డు పారిశుద్ధ్య అధికారి, ప్రొద్దుటూరు - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

కనులపండువగా దసరా ఉత్సవాలు ప్రారంభం


కన్యతీర్థంలో బాలా త్రిపురసుందరిగా...


మైదుకూరులో...


బి.మఠంలో త్రిముఖ దుర్గాదేవి


ప్రొద్దుటూరులో కలశాలతో బయలుదేరిన మహిళలు

దసరా ఉత్సవాలు గురువారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గ మండలాల్లో కనులపండువగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో రెండో మైసూరుగా ప్రసిద్ధిచెందిన ప్రొద్దుటూరు వైభవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరీదేవి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 102 మంది సువాసినులు అమ్మవారిశాల నుంచి అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం వరకు మంగళవాయిద్యాలు.. వేదపఠనాలతో నవగంగ తీర్థాలను తీసుకొని ఆలయానికి తెచ్చారు. శివాలయంరోడ్డులోని తెల్లాకుల శివయ్యగారి నగరేశ్వరస్వామి దేవస్థానంలో శివునికి ప్రత్యేక పూజల అనంతరం కన్యకాపరమేశ్వరిదేవి పురాణాన్ని ఆర్యవైశ్యులు తీసుకువచ్చారు. సుహాసినులు శివాలయం వరకు, అమ్మవారి పురాణాల కోసం ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద హరియాణా రాష్ట్రానికి చెందిన కళాకారులు భంభం భోలే అంటూ చేపట్టిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. శరీరమంతా విబూది పూసుకొని ప్రత్యేక శైలిలో నృత్య ప్రదర్శన చేశారు. పూనా ప్రాంత వాయిద్య కళాకారుల ప్రదర్శన అలరించింది. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఆయా ఆలయ కమిటీల సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్, శాంతిభద్రతలపరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు డీఎస్పీల ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం, జమ్మలమడుగు గ్రామీణ, బద్వేలు, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం


బద్వేలులో కలశాలతో వస్తున్న మహిళలు, భక్తులు


హరియాణా కళాకారుల నృత్యం


రతనాల వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద...

ప్రత్యామ్నాయం చూపకనే ల్యాప్‌టాప్‌లు వెనక్కు!

– న్యూస్‌టుడే, చాపాడు

ఏడేళ్ల క్రితం ప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థులకు వర్చువల్ తరగతులను నిర్వహించారు. తర్వాత అవి ఆగిపోయాయి. అందుకు సరఫరా చేసిన ల్యాప్‌టాప్‌లను ప్రస్తుతం తిరిగి వెనక్కు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి ప్రధానోపాధ్యాయులకు మౌఖిక ఆదేశాలు అందాయి. చాలా పాఠశాలల్లో కంప్యూటర్లు లేక ఈ ల్యాప్‌టాప్‌లతోనే పనులు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. సంబంధిత ల్యాప్‌టాప్ రూ.లక్షకు పైగా విలువ చేయనుంది. అప్పట్లో వీడియో పాఠాల బోధనకు ప్రొజెక్టర్, యాంటినా, బ్యాటరీలు, వైరింగ్ సమస్తం ప్రభుత్వమే సమకూర్చింది. ఏ పని చేయాలన్నా ఇప్పుడన్నీ ఆన్‌లైన్ కావడంతో కంప్యూటర్లు తప్పనిసరి అయ్యాయి. బడి అవసరాలకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా ఉన్నపళంగా ట్యాబ్‌లను వెనక్కు ఇవ్వాలనడం ఏంటని ప్రధానోపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై డీఈవో అనురాధను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా రాష్ట్ర నోడల్ అధికారి ఆదేశాల మేరకు వెనక్కు తీసుకుంటున్నట్లు చెప్పారు. మొత్తం 103 పాఠశాలల నుంచి ల్యాప్‌టాప్‌లు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 65 వచ్చాయన్నారు. వెనక్కు తీసుకుంటున్న ల్యాప్‌టాప్‌లపై మార్కర్‌తో పాఠశాల చిరునామా రాస్తున్నామని తెలిపారు. ఏడేళ్లు గడిచిపోగా, వాటి స్థానంలో కొత్తవి ఇచ్చే అవకాశం ఉండొచ్చని అన్నారు.

వివాహిత బలవన్మరణం

పెద్దముడియం, న్యూస్‌టుడే: జంగాలపల్లె నీలి విజయ (50) అనే వివాహిత కుటుంబ కలహాల నేపథ్యంలో బలవన్మరణం చెందారని ఎస్ఐ.సుబ్బారావు తెలిపారు. నీలి రామయ్య, విజయ దంపతులకు ఒక కుమార్తె సంతానం కలరు. భార్యాభర్తలు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమార్తె పెళ్లి విషయంలో బుధవారం దంపతులిద్దరూ గొడవపడ్డారు. ఈక్రమంలో మనస్తాపానికి గురై విజయ అదే రోజు రాత్రి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహాన్ని గురువారం పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారని ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

కాశినాయన, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వివాహిత సెప్టెంబర్ 30వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఈ మేరకు కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందిందని పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఖాదరయ్య తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

యువతి... : బ్రహ్మంగారిమఠం: మండలంలోని ఓ గ్రామంలో గురువారం ఓ యువతి అదృశ్యమయ్యారని స్థానిక పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఫిర్యాదు అందిందని పేర్కొన్నారు. యువతి ఆచూకీ వెతుకుతున్నామన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

ఖాజీపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరిధిలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని బొర్రా వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. రావులపల్లె నుంచి ఖాజీపేటకు ద్విచక్రవాహనంపై వస్తుండగా వక్కిలేరు సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

బియ్యం నిల్వలపై విచారణ

కాశినాయన: నరసాపురంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లోని బియ్యం నిల్వలపై గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్ విచారణ చేశారు. ఉద్యోగులే బియ్యం అమ్ముకుంటారని వచ్చిన ఆరోపణల క్రమంలో ఆయన దస్త్రాలు, బియ్యం సంచులను పరిశీలించారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

పెద్దముడియం, న్యూస్‌టుడే: జమ్మలమడుగు నుంచి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును గుండ్లకుంట గ్రామం వద్ద గురువారం పట్టుకున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ట్రాక్టరు డ్రైవరు మహేష్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టరును జప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ధ్యానోత్సవంపై కరపత్రాల ప్రచారం

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక నేతాజీనగర్-1లోని చౌడేశ్వరి ఆలయం పక్కన ఈ నెల 5, 6, 7వ తేదీ వరకు రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీనియరు అభ్యాసీలు గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ధ్యానం సాధన వలన వచ్చే ప్రయోజనాలను తెలియజేసేందుకు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

కలసపాడు, న్యూస్‌టుడే: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఎంఏవో జాకీర్‌షరీఫ్ తెలిపారు. గురువారం కలసపాడులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వరి, పత్తి పంటల సాగులో మెలకువలు, వరిలో సుడిదోమ నివారణ తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ గురులక్ష్మి, ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల బాలికలు... ఆటల్లో మెరికలు

క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థినులు

– న్యూస్‌టుడే, కొండాపురం

ఆ విద్యార్థినులది పేద, మధ్య తరగతి కుటుంబ నేపథ్యం. ఆత్మ విశ్వాసం, పట్టుదల వారి సొంతం. నిత్య సాధనకు కష్టం తోడైతే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు. అటు చదువుల్లో ఇటు క్రీడల్లో రాణిస్తూ శెభాష్ అనిపించుకుంటున్నారు. పోటీల్లో నైపుణ్యాలను ప్రదర్శించి పతకాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకుంటున్నారు. ఆట ఏదైనా గురిపెడితే పతకం రావాల్సిందేనని నిరూపిస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధమయ్యారు... కొండాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు ప్రిన్సిపల్ కృష్ణవేణి ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు మాధవి, కాటమ్మ విద్యార్థినులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. గత నెల జరిగిన అండర్-19 విభాగంలో ఖో-ఖో, హ్యాండ్‌బాల్, త్రోబాల్, చదరంగం (చెస్)లో మెరుగైన ఆటతీరును ప్రదర్శించి జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 10వ తేదీ పులివెందులలో జరిగిన ఖో-ఖోలో ఇంటర్మీడియట్ విద్యార్థులు అంజలి, నాగవల్లి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 13వ తేదీ గండిలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీలో కీర్తన, శివతులసి సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. 20వ తేదీ మైదుకూరులో జరిగిన త్రోబాల్ క్రీడలో అమరావతి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. 27వ తేదీ జమ్మలమడుగులో జరిగిన అండర్-14 విభాగంలో చదరంగం పోటీలో ఆరో తరగతి విద్యార్థి దివ్య జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

జాతీయ స్థాయిలో రాణిస్తా..



ఖో-ఖో క్రీడల్లో జిల్లా స్థాయిలో ప్రతిభచూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. అక్కడ సత్తా చాటి జాతీయ స్థాయిలో రాణించాలని ఉంది. అందుకు తగినట్లు గురుకుల కళాశాలలోని వ్యాయామ ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించి మంచి గుర్తింపు పొందడమే నా లక్ష్యం.
- నాగవల్లి, ఇంటర్మీడియట్, ఎంపీసీ, కొండాపురం

క్రీడలంటే ఎంతో ఇష్టం..



క్రీడలంటే చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. జిల్లా స్థాయిలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. ఈ క్రీడలో జిల్లాలో ప్రతిభచూపి రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికయ్యాను. అక్కడ ప్రతిభ చూపి మా కళాశాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకువస్తా. నిత్యం క్రీడల్లో పాల్గొనడం వల్ల అనారోగ్య సమస్యలు దరిచేరవు.
- శివతులసి, ఇంటర్మీడియట్, బైపీసీ, కొండాపురం

బరిలోకి దిగితే గెలుపే..



త్రోబాల్ క్రీడలో జిల్లా స్థాయిలో సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధంగా ఉన్నాను. నాకు క్రీడలు అంటే చాలా ఇష్టం. ఆటలో ప్రత్యేక ప్రతిభను చూపి గుర్తింపు సాధించాలని భావిస్తున్నాను. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నాను. కళాశాలలోని క్రీడా ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.
- అమరావతి, ఇంటర్మీడియట్, ఎంపీసీ, కొండాపురం.

జిల్లా కీర్తి చాటుతా



రాష్ట్ర స్థాయిలో ఖో-ఖో క్రీడలో ప్రతిభ చూపి జిల్లా కీర్తిని చాటుతాను. గత నెల జరిగిన క్రీడల్లో నేను రాష్ట్ర స్థాయి విభాగానికి ఎంపికయ్యాను. ఆటలో మెలకువలు నేర్చుకొని క్రీడలో సత్తాచాటుతాను. రానున్న రోజుల్లో జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడమే నాధ్యేయం.
- అంజలి, ఇంటర్మీడియట్, బైపీసీ, కొండాపురం

జిల్లా ఆసుపత్రికి శీతల పరికరాలు, బల్లల వితరణ

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులోని జిల్లా ఆసుపత్రికి రెండు శీతల పరికరాలు, వైద్యుల సౌకర్యార్థం కార్యాలయ పనుల నిమిత్తం బల్లలను సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, వైద్యులు వరుణ్‌కుమార్‌రెడ్డి, కుండా నాగరాజు ఆసుపత్రి పర్యవేక్షకులు ఆనందబాబుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఒంటేరు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపు ఇచ్చిన క్రమంలో రక్తనిధి కేంద్రానికి అవసరమైన రెండు శీతల పరికరాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ బాబు, గురుకుమార్ రెడ్డి, ఒంటేరు భాస్కర్‌రెడ్డి, 'హంసా' ప్రతినిధి రాజా, శివ, షేక్షావలి, యశ్వంత్, పాల్గొన్నారు.


ఆసుపత్రి పర్యవేక్షకులు ఆనందబాబుతో దాతలు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, తదితరులు

లక్ష్యాన్ని పట్టుదలతో సాధించాలి

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు జీవితంలో పెద్ద లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని యోవేవి ఉప కులపతి కె కృష్ణారెడ్డి, ఎస్‌బీవీఆర్ విద్యాసంస్థల కార్యదర్శి కె.రితేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థుల మధ్య పోటీ ఎక్కువగా ఉందని, ప్రణాళిక ప్రకారం కష్టపడి చదువుకుని క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డీన్ రామలక్ష్మీరెడ్డి, ప్రిన్సిపల్ వెంకటసుబ్బారెడ్డి, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ శ్యామ్‌సుందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు, సంఘ ప్రతినిధులను సత్కరించిన నాయకులు

జమ్మలమడుగు: ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ఆకాంక్షలకనుగుణంగా ఏర్పడిన నూతన ప్రభుత్వం 12వ పీఆర్సీ అమలులో భాగంగా దసరా పండగ సందర్భంగా మధ్యంతర భృతిని కానుకగా ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి కోరారు. జమ్మలమడుగులోని వివేకానంద జూనియర్ కళాశాలలో గురువారం ఎస్టీయూ ప్రాంతీయ సర్వసభ్య సమావేశం జరిగింది. రీజియన్ కన్వీనరు ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహించగా మైలవరం, జమ్మలమడుగు, పెద్దముడియం మండలాల ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బీమా పథకమైనా ఏపీజీఎల్ఐ, ప్రావిడెంట్ ఫండ్‌కు చెందిన ఫైనల్ పేమెంట్లు, లోన్ చెల్లింపులు సంవత్సరం పైగా పెండింగ్‌లో పెట్టారన్నారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్మును వారి అవసరాలకు సకాలంలో ఇవ్వకుండా పాలనకు ఉపయోగించుకుంటున్నారని ఆ బకాయిలను తమ ఖాతాలకు జమ చేయాలన్నారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు, సంఘంలో వివిధ పదవులు పొందిన వారిని ఘనంగా సత్కరించారు. నాయకులు ఇలియాస్ బాషా, రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, పాల్గొన్నారు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

హిందీ భాషతో ఎన్నో ప్రయోజనాలు

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: హిందీ భాష నేర్చుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని పీఎఫ్ కమిషనర్ గౌరవ్ మహల్వాల్ అన్నారు. హిందీ భాషా పక్షోత్సవాల సందర్భంగా గురువారం కడప పీఎఫ్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందీ ప్రాముఖ్యాన్ని వివరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ మహబూబ్‌బాషా, పలువురు అధికారులున్నారు.


మాట్లాడుతున్న పీఎఫ్ కమిషనర్ గౌరవ్ మహల్వాల్, పక్కన అధికారులు

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: నగరంలోని నివాస ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కడప ఎమ్మెల్యే మాధవికి ఆర్సీపీ నాయకులు వినతిపత్రం అందించారు. ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి నేతృత్వంలోని బృందం ఎమ్మెల్యేను కలిసి సమస్యలు వివరించారు. ఆయన మాట్లాడుతూ రామకృష్ణనగర్, పీఎస్ నగర్, శివానందపురం, గంజికుంట కాలనీ, గౌస్‌నగర్, తిలక్‌నగర్, బీడీకాలనీ తదితర ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మగ్బుల్‌బాషా, బాలచెన్నయ్య, ప్రసాద్ రాజు తదితరులున్నారు.


ఎమ్మెల్యే మాధవికి వినతి పత్రం అందిస్తున్న ఆర్సీపీ నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప: 8008573428, 8688701384
పులివెందుల: 8008573466
కమలాపురం: 8008573475

స్పందనకు వందనం

✦ కమలాపురం రైల్వే గేట్ సమీపంలో దుకాణం ఎదురుగా రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఇక్కడ వ్యర్థాలతో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో అసౌకర్యానికి గురవుతున్నారని 'ఈనాడు'లో ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ షఫీవుల్లా పారిశుద్ధ్య కార్మికులతో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

✦ కమలాపురంలోని సూర్య ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. వాటిని తినేందుకు మూగజీవాలు ఎగబడుతున్నాయి. ప్రమాదం జరిగే అవకాశం ఉందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. తమ సిబ్బందిని పంపి పిచ్చి మొక్కలు తొలగించారు. - న్యూస్‌టుడే, కమలాపురం

✦ కడప నగరంలోని కోర్టు పక్క నుంచి నాగార్జున పాఠశాల వెళ్లే రోడ్డుపై ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయని 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో నగరపాలక అధికారులు స్పందించి వెళ్లి పరిశీలించారు. అనవసరమైన స్పీడ్ బ్రేకర్లను తొలగిస్తామన్నారు. - న్యూస్‌టుడే, చిన్నచౌకు

?: మండలంలోని బోనాలలో ఏ వీధిలో చూసినా మురుగు నీరు సిమెంటు రోడ్లపై ప్రవహిస్తోంది. రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. - నారాయణ, బోనాల
✓: గ్రామంలో మురుగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. - లోకేశ్వరరావు, ఎంపీడీవో
- న్యూస్‌టుడే, లింగాల

?: తొండూరు మెయిన్ బజారు కాలువలోని పూడిక తీసి వదిలేయడంతో దుర్వాసన వస్తోంది. - మంజునాథరెడ్డి
✓: మురుగు పూడికను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - సాయిప్రతాప్‌రెడ్డి, పంచాయతీ అధికారి
- న్యూస్‌టుడే, తొండూరు

?: కడప రోడ్ గాంధీ విగ్రహం నుంచి బిల్లస్‌కు వెళ్లే దారిలో మసీదు వద్ద చెట్టు కొమ్మ పూర్తిగా వంగి ఉంది. బస్సులు వెళ్లేటప్పుడు కొమ్మలు తగులుతున్నాయి. ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. - చంటి,
✓: ఆ ప్రాంతాన్ని పరిశీలించి ప్రమాదకరంగా ఉంటే కొమ్మను తొలగిస్తాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం - చంద్రశేఖర్, వైద్యాధికారి

?: కడప ఐటీఐ కూడలి వద్ద రాయచోటికి వెళ్లే బస్సులు మలుపు వద్దనే ఆపేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. - మురళీకృష్ణ, కడప.
✓: ఈ విషయాన్ని కడప డిపో మేనేజరు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తాను. డ్రైవర్లు అవగాహన కల్పిస్తాం. - జావెద్, ట్రాఫిక్ సీఐ, కడప
- న్యూస్‌టుడే, చిన్నచౌకు

చిన్నారులు... తైక్వాండో చిరుతలు

న్యూస్‌టుడే, కడప క్రీడలు

కడప నగరానికి చెందిన చిన్నారులు ఆత్మరక్షణ విద్యల్లో సత్తా చాటుతున్నారు. క్రమం తప్పని సాధనతో తక్కువ సమయంలోనే పతకాలు కొల్లగొడుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తూ అందరినీ మెప్పిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఆర్మీలో చేరి దేశానికి సేవ చేస్తా



చిన్నతనం నుంచి ఆటలంటే ఇష్టం. అందులో యుద్ధ క్రీడలంటే చాలా మక్కువ. నాలుగేళ్లుగా తైక్వాండోలో శిక్షణ తీసుకుంటున్నా. కడపలో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో, తర్వాత రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ బంగారు పతకాలు సాధించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై తిరుపతిలో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లోనూ బంగారు పతకం గెలుచుకున్నా. భవిష్యత్తులో ఆర్మీలో చేరి దేశ సరిహద్దులో సేవ చేస్తా. - నవాజ్ రెహమాన్, ఏడో తరగతి

తక్కువ సమయంలోనే పతకాలు



నేను రెండేళ్లుగా తైక్వాండోలో శిక్షణ తీసుకుంటున్నా. ఏడాదిగా క్రమం తప్పని కఠిన సాధనతో ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. తక్కువ సమయంలోనే జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో, కడపలోనే జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ బంగారు పతకాలు సాధించాను. తిరుపతిలో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లోనూ గోల్డ్‌మెడల్ వచ్చింది. తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా చదువులోనూ రాణించి ఉన్నతోద్యోగం సాధిస్తా. - ఎం.సుహృత్, పదో తరగతి

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...



చదువుతో పాటు జీవితానికి ఆటలూ ముఖ్యమని అమ్మానాన్నలు ప్రోత్సహించారు. నాలుగేళ్లుగా తైక్వాండో ఆడుతున్నా. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపికయ్యా. అక్కడ కూడా సత్తాచాటి బంగారు పతకం సాధించా. భవిష్యత్తులో క్రీడా కోటాలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా అడుగులేస్తున్నా. - జి.తుశాంత్, పదో తరగతి

అమ్మాయిలకు తప్పనిసరి



నేటి తరం అమ్మాయిలకు యుద్ధ క్రీడలు తప్పనిసరని నాన్న చెప్పారు. అందుకే తైక్వాండోలో శిక్షణ ఇప్పిస్తున్నారు. రెండేళ్లుగా శిక్షకులు వెంకటేశ్ వద్ద తర్ఫీదు పొందుతున్నా. జిల్లా స్థాయి పోటీల్లో బంగారు, రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకాలు సాధించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో కఠిన సాధన చేస్తున్నా. - టి.పవిష్ట, ఐదో తరగతి

ఆటోలకు పోలీసు సంఖ్యల కేటాయింపు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు అధికారి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కడప ట్రాఫిక్ సీఐ జావెద్ గురువారం నుంచి ఆటోలకు కొత్త పోలీసు నంబర్లను కేటాయించారు. గతంలో కేటాయించిన నంబర్లు సక్రమంగా లేకపోవడం, ఇటీవల ఆటోల సంఖ్య పెరగడంలో చాలా వాటికి పోలీసు నంబర్లు లేవు. ఈ మేరకు ఏదైనా నేరం జరిగితే ఆటోవాలాలను గుర్తించడం కష్టంగా మారింది. ఈనైపథ్యంలో ఆటోలకు కొత్తగా మొదటి నుంచి నంబర్లు కేటాయించారు.

పక్కాగా నూతన మద్యం విధానం అమలు

సిద్దవటం, న్యూస్‌టుడే : నూతన మద్యం విధానాన్ని పక్కాగా అమలు చేయాలని డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు. సిద్దవటంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సూపరింటెండెంట్ రవికుమార్, సహాయ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, సిద్దవటం సీఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


దస్త్రాలు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ జయరాజ్

శనగ విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోండి

కమలాపురం : వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని కమలాపురం మండలానికి 4,460 క్వింటాళ్లు, ఎర్రగుంట్లకు 3,959, వల్లూరుకు 2,393, వీఎన్‌పల్లెకు 4,070 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. మండలంలోని చిన్నచెప్పలిలోని రైతు సేవా కేంద్రంలో శనగవిత్తనాల పంపిణీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. విస్తరణాధికారి దస్తగిరి, ఉద్యాన సహాయకురాలు సుప్రియ, రైతులు పాల్గొన్నారు.

లింగాల : మండలానికి 1838 కింటాళ్ల రాయితీ శనగలు మంజూరయ్యాయని వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. కావాల్సిన రైతులు సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

వేముల : రబీలో రైతులు శనగపంట సాగుచేయడానికి వీలుగా 25శాతం రాయితీతో మండలానికి ప్రభుత్వం 2,876 క్వింటాళ్ల శనగ విత్తనాలను మంజూరు చేసిందని వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తెలిపారు. విత్తనాలను పొందేందుకు శనివారం నుంచి రైతు సేవాకేంద్రాల్లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు.

తొలగిన మురుగు సమస్య

స్పందనకు వందనం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం దర్శనం కోసం వస్తున్న భక్తులు స్నానం చేయడానికి, వస్త్రాలు మార్చుకోవడానికి నిర్మించిన భవన సముదాయం ముంగిట్లో మురుగు పేరుకుపోయిందని 'ఈనాడు'లో ప్రచురితమై కథనానికి తితిదే సివిల్ విభాగం సాంకేతిక నిపుణులు స్పందించారు. దెబ్బతిన్న కడప నాపరాయ బండలు, పైపులైనును మార్పు చేశారు. వ్యర్థ నీరు బయటికి వెళ్లడానికి పీవీసీ పైపులు ఏర్పాటు చేస్తున్నారు. శాశ్వత పరిష్కారానికి ప్రత్యామ్నాయ పనులు చేపట్టినట్లు ఏఈ అమరనాథ్‌రెడ్డి తెలిపారు.


మురుగుదొడ్ల వద్ద శుభ్రంగా ఉన్న ప్రాంతం

ఎడ్లబండిని ఢీకొన్న ఆటో

కమలాపురం, న్యూస్‌టుడే : మండలంలోని సి. గోపాలపురం గ్రామ సమీపంలో కడప-తాడిపత్రి జాతీయ రహదారిలో గురువారం ఎడ్లబండిని ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఎడ్లకు స్వల్పగాయాలు కాగా బండి, ఆటో దెబ్బతిన్నాయి.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతులు సాగు చేసిన పంటల్లో మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించాలని కడప మండల వ్యవసాయాధికారి సురేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మోడమీద పల్లెలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. విస్తరణాధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : పంటలకు తెగుళ్ల రాక ముందు నుంచి సస్యరక్షణ చర్యలు చేపడితే నష్టం వాటిల్లదని, సాగులో ఖర్చులు తగ్గుతాయని ఏడీఏ వెంకటసుబ్బయ్య అన్నారు. కాంబల్లె, బలపనూరు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

మారుతీనగర్, న్యూస్‌టుడే: క్యాన్సర్ బారిన పడి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నరసయ్యకు శ్రీవెంకటలక్ష్మీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కూన ఈశ్వర్‌రెడ్డి నిత్యావసర సరకులు, రూ. 8వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు భారవి, సభ్యులు భాస్కర్, వరప్రసాద్, బాలకృష్ణప్రసాద్, ఓబులేసు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

దూర విద్య విధానంలో రైతులకు శిక్షణ

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాయం ఆధ్వర్యంలో రైతులకు దూర విద్య ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించి ధ్రువపత్రాలు అందిస్తామని ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్ తెలిపారు. చిరుధాన్యాల పంట సాగు, సేంద్రియ ఎరువులు, వర్మికంపోస్టు తయారీ, తేనెటీగల పెంపకంలో రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామని చెప్పారు. కోర్సులో చేరాలనే ఆసక్తి ఉన్న రైతు రూ. 1500 చెల్లించాలని, ఈనెల 15వ తేదిలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పీబీసీకి లీకుతో నీరు వృథా

వేముల, న్యూస్‌టుడే: పులవెందుల బ్రాంచి కెనాల్(పీబీసీ)కి వి.కొత్తపల్లె వద్ద లీకేజీ ఏర్పడడంతో నీరు వృథాగా పోతోంది. వేముల, వేంపల్లె మండలాల్లోని చెరువులకు నీటిని నింపేందుకు ఇటీవల కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ క్రమంలో కొత్తపల్లె వద్ద పెద్ద లీకేజీ ఏర్పడి నీరు బయటకు వచ్చి వృథాగా పోతోంది. దీంతో దిగువన ఉన్న వేంపల్లె మండలానికి నీరు చేరడానికి ఆటంకం ఏర్పడుతోంది. లీకులను పూడ్చి నీరు సక్రమంగా సరఫరా సాగేలా చూడాలని వేంపల్లె మండల రైతులు కోరుతున్నారు.


వృథాగా పోతున్న నీరు


దేవుని కడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకారం


గడ్డిబజార్ సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో ...


రవీంద్రనగర్ శ్రీరామాంజనేయస్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరిగా


లలిత పంచాయతన ఆలయంలో


వేముల: మీనాక్షిదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి

అమ్మవు నీవే... అఖిల జగాలకు...

మారుతీనగర్, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి ఏకాంత పూజలు చేశారు. శ్రీవిజయదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారు శైలపుత్రిగా దర్శనమిచ్చారు. అమ్మవారిశాలలో దీక్షాబంధన దేవిగా దర్శనమిచ్చారు. దేవుని కడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి, లలిత పంచాయతన, గడ్డిబజార్ సోమసుందరేశ్వర స్వామి, సత్యనారాయణస్వామి, రవీంద్రనగర్ తదితర ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు చేశారు.


విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు


ఒంటిమిట్ట: కన్యకాపరమేశ్వరి ఆలయంలో


వల్లూరులో వాసవీమాత


కమలాపురం అమ్మవారిశాలలో కన్యాకాపరమేశ్వరి


కడప చిన్నబెస్తవీధిలోని బాలపోలేరమ్మ ఆలయంలో


భువనేశ్వరిమాత ఆలయంలో


కమలాపురం: అమ్మవారి చిత్ర పటాన్ని తీసుకొస్తున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటరమణయ్య

ఘనంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

కమలాపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య ఇంటికెళ్లి సంఘం నాయకులు ఆహ్వానించారు. ఆయన వారితో కలిసి అమ్మవారి చిత్రపటంతో అమ్మవారిశాలకు వచ్చారు. మహిళలు కలశాలు, పూలను తీసుకొచ్చి పూజలు నిర్వహించారు.

సింహాద్రిపురం: మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి, పెద్దమ్మగుడి, పాతూరు, కొత్తూరు చౌడేశ్వరి దేవాలయాల్లో దసరా సందర్భంగా శర్నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. తెదేపా నియోజవర్గ బాధ్యుడు మారెడ్డి రవీంద్రనాథరెడ్డి సతీమణి లతారెడ్డి తొలిపూజ నిర్వహించి వేడుకలకు అంకురార్పణ చేశారు. వెంకటేశ్వరస్వామిని మత్స్యావతారంలో, అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.


సింహాద్రిపురంలో పల్లకీసేవను ప్రారంభిస్తున్న భక్తులు, అర్చకులు

నగరంలో భారీ వర్షం... రహదారులు జలమయం

కడప నగరంలో గత నాలుగైదు రోజుల నుంచి ఎండలు వేసవి కాలాన్ని తలపించాయి. ఉక్కపోతతో నగరవాసులు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. అరగంట పాటు కురిసిన వానలకు నగరంలో రహదారులు జలమయమయ్యాయి. మరోసారి ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలోకి భారీగా నీరు రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మురుగు కాలువలు పొంగి ప్రవహించాయి.

- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, చిన్నచౌకు


రైల్వేస్టేషన్ రోడ్డులో నిలిచిన నీరు


చెరువులా మారిన బస్టాండు ప్రాంగణం

అధికారులను నిలదీసిన తెదేపా నాయకులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఉపాధి హామీ గ్రామ సభను అధికారులే బాయ్‌కాట్ చేయడమేంటి అని ఎంపీడీవో రెడ్డెయ్య, ఈవోపీఆర్డీ రంగయ్యను తెదేపా నాయకులు నిలదీశారు. మండలంలోని కొండమాచుపల్లె పంచాయతీ కార్యాలయంలో ఉపాధి పనుల గుర్తింపుపై గురువారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ విస్తరణాధికారి కుమార రంగయ్య, ఏపీవో శివశంకర్‌రెడ్డి, సాంకేతిక నిపుణులు శ్రీవాణి, దస్తగిరి హాజరయ్యారు. వైకాపా, తెదేపా వర్గీయులు, స్థానికులు కూడా వచ్చారు. వేదికపై సర్పంచి శివనారాయణ, అధికారులు కూర్చోగా, గ్రామ తెదేపా కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులుకు అతిథి స్థానం కల్పించాలని నాయకులు అభ్యర్థించారు. వారొస్తే తాను ఉండనని సర్పంచి వెళ్లిపోయారు. అయినా సమావేశాన్ని నిర్వహించాలని తెదేపా నాయకులు అడిగారు. దీంతో అధికారులు, నేతల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకొంది. ఈవోపీఆర్డీ గ్రామసభను బాయ్‌కాట్ చేస్తున్నా అంటూ వెళ్లిపోయారు. దీంతో తెదేపా నాయకులు ఎంపీడీవో రెడ్డెయ్య దృష్టికి ఈ సమస్యను తీసుకొచ్చారు. చివరకు ఈవోపీఆర్డీ ఘటనపై క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. త్వరలో మళ్లీ సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు.


ఎంపీడీవో రెడ్డెయ్య, ఈవోపీఆర్డీ రంగయ్యను నిలదీస్తున్న తెదేపా నాయకులు